TG/TEL/25/A3731

# నిజం

దృష్టి తెలుగు న్యూస్

WANTED

రిపోర్టర్లు కావలెను

నిజం దృష్టి తెలుగు న్యూస్

దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-183 | పేజీలు:-4 | మంగళవారం 16-06-2026

SIMULTANEOUSLY PRINTED AT ADILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## మోదీ పర్యటనకు 'ధురంధర్' టచ్.. మేక్రాన్ ఆసక్తికర పోస్ట్

- ఫ్రాన్స్‌లో పర్యటించిన మోదీ
- అధ్యక్షుడు మేక్రాన్‌తో భేటీ
- పర్యటన వివరాలను వీడియో రూపంలో పోస్ట్ చేసిన మేక్రాన్
- బ్యాగ్రౌండ్‌లో ధురంధర్ పాట



భారత్-ఫ్రాన్స్ సంబంధాలకు బాలీవుడ్ టచ్ ఇచ్చారు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్. ప్రధాని నరేంద్ర మోదీ ఫ్రాన్స్ పర్యటన సందర్భంగా ఆయన షేర్ చేసిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. - మిగతా 2 లో

## ఇరాన్ నిధులపై ట్రంప్ మెలిక రూ.లక్ష కోట్ల నిధులపై వీడని ప్రతిష్టంభన

- ★ అమెరికా, ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం ఖరారు
- ★ మూడు నెలల సైనిక ఉద్రిక్తతలకు ముగింపు
- ★ జూన్ 19న స్విట్జర్లాండ్‌లో అధికారికంగా సంతకాలు
- ★ హర్మూజ్ జలసంధిపై ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటన
- ★ నిలిచిపోయిన నిధుల విడుదలే ఒప్పంద అమలుకు కీలకం



పశ్చిమ ఆసియాలో మూడు నెలలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరపడింది. అమెరికా, ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో జరిగిన చర్చలు ఫలించి, ఇరు దేశాలు ఈ ఒప్పందానికి అంగీకరించాయి. ఈ నెల 19న స్విట్జర్లాండ్‌లో ఇరు దేశాల - మిగతా 2 లో

## 71 సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా 'పెద్దన్న'ను ఒప్పించలేకపోయారు



- హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు అనుమతులు తేలేకపోవడం రేవంత్ ప్రభుత్వ వైఫల్యమేనన్న కేటీఆర్
- ఓటుకు నోటు కేసు భయంతోనే బీజేపీతో రహస్య ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపణ
- మెట్రో వైఫల్యంపై సీఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు సాధించడంలో - మిగతా 2 లో

# మెట్రో నిధులు రూ.13,600 కోట్లు ఇవ్వండి

### కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్

- హైదరాబాద్ మెట్రో కోసం రూ.13,600 కోట్లు విడుదల చేయాలని కేంద్రానికి సీఎం రేవంత్ డిమాండ్
- నిధుల విడుదలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు
- మెట్రో ఫేజ్-2 నిర్మాణంలో భాగస్వామ్యంపై కేంద్రం స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి
- సహకరించకపోతే కనీసం చీజ అయినా ఇవ్వాలని ప్రభుత్వ వాదన
- తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని రేవంత్ రెడ్డి విమర్శ



2లో

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1 రీఫైనాన్సింగ్ కోసం ఉద్దేశించిన రూ.13,600 కోట్ల టర్మ్ లోన్‌ను తక్షణమే విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం

## దేశ ప్రగతికి అంకితభావంతో పనిచేస్తున్నారు

### కిషన్‌రెడ్డిపై మోదీ ప్రశంసలు



- కిషన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మోదీ శుభాకాంక్షలు
- కష్టపడే నాయకుడని ప్రశంసలు
- బొగ్గు, గనుల రంగంలో సంస్కరణలు చేపట్టారని కితాబు
- అమిత్ షా సహా ఇతర కేంద్ర మంత్రులూ శుభాకాంక్షలు

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రధాని - మిగతా 2 లో

## విజయ్-సంగీత విడాకుల కేసు విచారణ వాయిదా



- సీఎం విజయ్, ఆయన భార్య సంగీత విడాకుల కేసు విచారణ ఆగస్టు 7వ తేదీకి వాయిదా
- విజయ్‌కు మరో నటితో వివాహేతర సంబంధం ఉందని, తీవ్రంగా వేధించారని సంగీత ఆరోపణ
- తనను, పిల్లలను అవమానాలకు గురిచేశారని విడాకుల పిటిషన్‌లో పేర్కొన్న సంగీత
- ఇటీవల జరిగిన ఎన్నికల్లో చారిత్రాత్మక విజయంతో సీఎంగా బాధ్యతలు చేపట్టిన విజయ్

తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు విజయ్ ఆయన భార్య సంగీత - మిగతా 2 లో

## ఇందిరా గాంధీ ఉంటే బీజేపీని నిషేధించేవారు



- ★ దేశంలో పరిస్థితులు ప్రమాదకరంగా మారాయన్న గెహ్లాట్
- ★ 50 ఏళ్ల జీవితంలో ఎప్పుడూ చూడలేదన్న కాంగ్రెస్ నేత
- ★ మత విద్వేషాలను అధికార పార్టీయే ప్రోత్సహిస్తోందని ఆరోపణ
- ★ హిందుత్వ మద్దతుదారులను రెచ్చగొట్టి గెలుస్తారా? అని ప్రశ్న
- ★ కాంగ్రెస్‌కు హిందుత్వ అంటే ద్వేషమంటూ బీజేపీ మండిపాటు

కాంగ్రెస్ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ - మిగతా 2 లో

# పశ్చిమాసియాలో శాంతికి మార్గం

- అమెరికా-ఇరాన్ ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని మోదీ
- అమెరికా, ఇరాన్ మధ్య కీలక ఒప్పందం కుదిరినట్లు ప్రకటన
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తెర దించేందుకు అవగాహన
- హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవనున్నట్లు ప్రకటించిన ట్రంప్
- ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని మోదీ.. శాంతి నెలకొనాలని ఆకాంక్ష




2లో

పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ ప్రాంతంలో వివాదానికి ముగింపు పలికేందుకు ఇరు దేశాల మధ్య అవగాహన కుదరడాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ ఒప్పందం అమలుతో పశ్చిమాసియాలో తిరిగి శాంతి, స్థిరత్వం నెలకొంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ ఇంధన మార్కెట్లను తీవ్రంగా కుదిపేసి,

# ఏపీని గ్లోబల్ హబ్‌గా మార్చే దిశగా సీఎం చంద్రబాబు

### గూగుల్, ఎన్‌యూఎస్‌తో కీలక భేటీలు

- గూగుల్ క్లౌడ్, సింగపూర్ వర్సిటీ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు భేటీ
- ఏపీని ఏఐ, డేటా హబ్‌గా మార్చేందుకు గూగుల్ తో కీలక చర్చలు
- నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయం
- అమరావతిలో క్యాంపస్ ఏర్పాటు చేయాలని ఎన్‌యూఎస్‌కు ప్రతిపాదన
- రాష్ట్ర అభివృద్ధికి సాంకేతిక, విద్యా రంగాల్లో భాగస్వామ్యంపై దృష్టి



2లో

సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు వివిధ సంస్థలతో వరుస భేటీలు నిర్వహిస్తూ బిజీగా ఉన్నారు. ఏపీని టెక్నాలజీ, విద్యారంగాల్లో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆయన కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

## ఢిల్లీ మెడలు వంచుతామంటారు

### ఇక్కడికొచ్చి సైలెంట్ అవుతారు: పవన్ చురకలు



- అధికారం కోసం పార్టీ పెట్టలేదని పవన్ కల్యాణ్ స్పష్టీకరణ
- దేశ సమగ్రతే జనసేన ప్రధాన లక్ష్యమని వెల్లడి
- తెలంగాణ ఏర్పాటును తాను వ్యతిరేకించలేదన్న జనసేనాని
- విభజన జరిగిన తీరుపైనే తన ఆవేదన అని వ్యాఖ్య

జనసేన పార్టీ ఢిల్లీ వేదికగా 'జనసేన ప్రస్థానం-జాతీయ సమగ్రత కోసం' అనే ప్రత్యేక సమావేశాన్ని - మిగతా 2 లో

## టెక్నాలజీ, ఎయిర్ కనెక్టివిటీ సింగపూర్ పర్యటనలో చంద్రబాబు కీలక భేటీలు



- సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- విదేశీ వ్యవహారాల మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తోనూ కీలక సమావేశం
- అమరావతి సహా అర్బన్ గవర్నెన్స్‌లో సహకారం కోరిన ముఖ్యమంత్రి
- ఏపీ నుంచి ఆక్వా, ఉద్యాన ఉత్పత్తుల దిగుమతికి విజ్ఞప్తి
- సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎయిర్ కనెక్టివిటీపై ఫలవంతమైన చర్చలు

సింగపూర్ లో పర్యటిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు, సోమవారం అక్కడ - మిగతా 2 లో

## ఢిల్లీ మెడలు వంచుతామంటారు

మొదటిపేజీ తరువాయి – నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, అధికారం కోసం తాను పార్టీ పెట్టలేదని, దేశ సమగ్రతను కాపాడటమే జనసేన ముఖ్య లక్ష్యమని స్పష్టం చేశారు. పార్టీ స్థాపించి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ పన్నెండేళ్లలో ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేశామని పవన్ గుర్తుచేశారు. కొన్ని పార్టీలు కేవలం తమ మనుగడ కోసం దేశ సమగ్రతను పణంగా పెడుతున్నాయని ఆరోపించారు. దేశ స్ఫూర్తిని ప్రతి తరం ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ ఏర్పాటుపై తన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. తాను తెలంగాణ ఏర్పాటును ఎన్నడూ వ్యతిరేకించలేదని, కాంగ్రెస్ పార్టీ ఏపీని విభజించిన తీరుపైనే ఆనాడు ఆవేదన వ్యక్తం చేశానని వివరించారు. విభజన జరిగిన తీరు రెండు రాష్ట్రాల మధ్య అసంతృప్తిని, అశాంతిని మిగిల్చిందని, ఆస్తుల పంపకాల వంటి సమస్యలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పవన్ వ్యాఖ్యానించారు. “ఢిల్లీకి వచ్చి మెడలు వంచుతామని మాట్లాడే నాయకులు ఇక్కడికి రాగానే మౌనంగా ఉండిపోతారు” అని ఆయన అన్నారు. దేశ రక్షణకు, భద్రతకు ఢిల్లీ ప్రధాన కేంద్రమని, భారత రాజ్యాంగం పుట్టిన చోటు కాబట్టే జాతీయ సమగ్రతపై మాట్లాడేందుకు ఈ వేదికను ఎంచుకున్నట్లు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## ఇందిరా గాంధీ ఉంటే బీజేపీని నిషేధించేవారు

మొదటిపేజీ తరువాయి – వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఈరోజు బతికి ఉంటే బీజేపీ వంటి పార్టీని నిషేధించేవారని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై బీజేపీ తీవ్ర స్థాయిలో మండిపడింది. జైపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు చాలా ప్రమాదకరంగా మారాయన్నారు. తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి వాతావరణాన్ని ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. మతపరమైన విద్వేషాలను అధికారంలో ఉన్నవారే ఉద్దేశపూర్వకంగా ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ హిందుత్వ పేరుతోనే రాజకీయాలు చేస్తోందని గెహ్లాట్ విమర్శించారు. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో ఒక్క ముస్లిం అభ్యర్థికీ టికెట్ ఇవ్వకపోవడాన్ని ప్రస్తావిస్తూ కనీసం కొన్ని స్థానాలైనా కేటాయించి ఉంటే దేశానికి వేరే సందేశం వెళ్లేదని అన్నారు. హిందుత్వ మద్దతుదారులను రెచ్చగొట్టి అధికారంలో కొనసాగాలనే ఆలోచనతో రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. “ఇందిరా గాంధీ వంటి బలమైన నాయకురాలు ఇప్పుడుంటే బీజేపీపై నిషేధం విధించేవారు. కేవలం హిందుత్వ అజెండాతోనే పార్టీని నడపాలనుకుంటున్నారా? హిందువుల పేరుతోనే రాజకీయాలు చేయాలనుకుంటున్నారా?” అని ప్రశ్నించారు. అశోక్ గెహ్లాట్ వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్‌కు హిందువులు, హిందుత్వం అంటే ద్వేషమని ఆరోపించారు. హిందుత్వం ఒక జీవన విధానమని సుప్రీంకోర్టు ఇప్పటికే పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. గెహ్లాట్ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ అత్యవసర పరిస్థితి నాటి మనస్తత్వాన్ని గుర్తు చేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ఇప్పుడు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కాదని, ముస్లింలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చే పార్టీగా మారిపోయిందని ఆరోపించారు. హిందుత్వ గురించి మాట్లాడితే తప్పుగా చూస్తూ, ముస్లింల ఓటు బ్యాంకు రాజకీయాలనే కాంగ్రెస్ చేస్తోందని అన్నారు.

## విజయ్-సంగీత విడాకుల కేసు విచారణ వాయిదా

మొదటిపేజీ తరువాయి – స్వర్ణలింగం విడాకులు కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈరోజు చెంగల్పట్టు మహిళా కోర్టులో విచారణ జరిగింది. ఉదయం 10:30 గంటలకు ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, తదుపరి విచారణను ఆగస్టు 7వ తేదీకి వాయిదా వేసింది. విజయ్‌కు మరో నటితో వివాహేతర సంబంధం ఉందని ఆరోపిస్తూ సంగీత ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ విడాకుల పిటిషన్‌ను దాఖలు చేశారు. తన పిటిషన్‌లో సంగీత పలు సంచలన ఆరోపణలు చేశారు. 2021లోనే విజయ్‌కు మరో నటితో వివాహేతర సంబంధం ఉందని తాను గుర్తించానని, దీనిపై నిలదీసినప్పుడు ఆ బంధాన్ని తెంచుకుంటానని విజయ్ పలుమార్లు హామీ ఇచ్చారని తెలిపారు. అయినప్పటికీ, విజయ్ ఆ సంబంధాన్ని కొనసాగించడమే కాకుండా సదరు నటితో కలిసి విహారయాత్రలకు, ఇతర కార్యక్రమాలకు హాజరయ్యారని ఆరోపించారు. వారిద్దరూ బహిరంగ ప్రదేశాల్లో కలిసి ఉన్న ఫొటోలను ఆ నటి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ద్వారా తనను, తన ఇద్దరు పిల్లలు జాసన్ సంజయ్, దివ్య సాషాను తీవ్ర అవమానానికి గురిచేశారని సంగీత ఆవేదన వ్యక్తం చేశారు. విజయ్ తనపై ఆర్థిక ఆంక్షలు విధించారని, గతంలో ఉన్న సౌకర్యాలను ఉపసంహరించుకుని, తన స్వేచ్ఛను కూడా నియంత్రించారని సంగీత ఆరోపించారు. ఈ పరిణామాల వల్ల తాను తీవ్రమైన మానసిక వేదనకు గురయ్యానని, ప్రత్యేక వివాహాల చట్టంలోని సెక్షన్ 27(1)(ఘ), 27(1)(ఎ) కింద తనకు విడాకులు మంజూరు చేయాలని ఆమె కోర్టును అభ్యర్థించారు. 2000 సంవత్సరంలో వివాహం చేసుకున్న విజయ్, సంగీత... తమ 26 ఏళ్ల వైవాహిక బంధానికి ముగింపు పలకాలని నిర్ణయించుకున్నారు. వాస్తవానికి ఈ కేసు విచారణ ఏప్రిల్ 20నే జరగాల్సి ఉండగా, వారిద్దరూ హాజరుకాకపోవడంతో జూన్ 15న తప్పనిసరిగా హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఒకవైపు వ్యక్తిగత జీవితంలో ఈ గందరగోళం నడుస్తుండగా, మరోవైపు విజయ్ రాజకీయ ప్రస్థానం ఉన్నత శిఖరాలకు చేరింది. ఆయన స్థాపించిన ‘తమిళగ వెట్రి కళగం’ (టీవీకే) పార్టీ, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం సాధించింది. దాదాపు 60 ఏళ్లుగా తమిళనాడును పాలిస్తున్న డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలను ఓడించి, మే 10న విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

## మోదీ పర్యటనకు ‘ధురంధర్’ టచ్.. మేక్రాన్ ఆసక్తికర పోస్ట్

మొదటిపేజీ తరువాయి – బాలీవుడ్ చిత్రం ‘ధురంధర్’లోని ప్రముఖ ‘ఆరీ ఆరీ’ పాటను బ్యాక్‌గ్రౌండ్‌లో ప్లే చేస్తూ మోదీ పర్యటనలోని ముఖ్య ఘట్టాలను ఆ వీడియోలో పొందుపరిచారు. సుమారు 30 సెకన్ల నిడివి ఉన్న ఈ వీడియోను ‘ఎక్స్’, ఇన్‌స్టాగ్రామ్‌లో మేక్రాన్ పోస్టు చేశారు. మోదీ, మేక్రాన్ పరస్పరం కరచాలనం చేసుకోవడం, ఆప్యాయంగా ఆలింగనం చేసుకోవడం నుంచి వీడియో ప్రారంభమవుతుంది. అనంతరం ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో మోదీ పాల్గొన్న కార్యక్రమాలు, ఇరు దేశాల మధ్య సాంకేతికత, ఆవిష్కరణలు, వ్యూహాత్మక భాగస్వామ్యానికి సంబంధించిన దృశ్యాలు కనిపిస్తాయి. భారతీయ పాప్ కల్చర్‌ను మేక్రాన్ తన సోషల్ మీడియా పోస్టుల్లో ఉపయోగించడం ఇదే తొలిసారి కాదు. గతంలో కూడా భారత్ పర్యటన ముగిసిన తర్వాత ‘ధురంధర్’కు సంబంధించిన సంగీతంతో కూడిన వీడియోను ఆయన షేర్ చేశారు. దీంతో భారతీయ నెటిజన్ల నుంచి మంచి స్పందన లభించింది.

## ఇరాన్ నిధులపై ట్రంప్ మెలిక.. రూ.లక్ష కోట్ల నిధులపై వీడని ప్రతిష్టంభన



మొదటిపేజీ తరువాయి – ప్రతినిధులు ఈ శాంతి పత్రాలపై అధికారికంగా సంతకాలు చేయనున్నారు. ఈ ఒప్పందం ఖరారైన వెంటనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. హర్మూజ్ జలసంధిపై ఉన్న నౌకాదళ ఆంక్షలను తక్షణమే ఎత్తివేస్తున్నట్లు ‘ట్రూత్ సోషల్’ వేదికగా వెల్లడించారు. “ఇరాన్‌తో ఒప్పందం పూర్తయింది. ప్రపంచ దేశాల నౌకలు.. మీ ఇంజన్లు స్టార్ట్ చేయండి” అంటూ చమురు సరఫరాను పునరుద్ధరించాలని పిలుపునిచ్చారు. ఈ ఒప్పందం ప్రకారం, లెబనాన్‌తో సహా అన్ని సరిహద్దుల్లో తక్షణ కాల్పుల విరమణ అమలులోకి వస్తుంది. అయితే, ఈ ఒప్పందం పూర్తిస్థాయిలో అమలయ్యేందుకు ఇరాన్‌కు చెందిన నిధుల విడుదల అంశం కీలకంగా మారింది. అమెరికా ఆంక్షల కారణంగా వివిధ దేశాల్లో నిలిచిపోయిన 12 బిలియన్ డాలర్ల (సుమారు రూ. లక్ష కోట్లు) నిధులను చర్చలకు ముందే విడుదల చేయాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్‌ను ట్రంప్ తోసిపుచ్చారు. ఒప్పందంలోని నిబంధనలను ఇరాన్ అమలు చేసిన తర్వాతే, పనితీరు ఆధారంగా విడతల వారీగా మానవతా దృక్పథంతో నిధులను విడుదల చేస్తామని స్పష్టం చేశారు. అణు ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే మళ్లీ దాడులు తప్పవని హెచ్చరించారు. ఈ శాంతి ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. స్విట్జర్లాండ్‌లో జరిగే ఈ సమావేశం పశ్చిమాసియాలో శాంతి స్థాపన దిశగా కీలక ముందడుగు అని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఏపీని గ్లోబల్ హబ్‌గా మార్చే దిశగా సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి – ఈ క్రమంలో గూగుల్ క్లౌడ్, సింగపూర్ జాతీయ విశ్వవిద్యాలయం (ఎన్‌యూఎస్) ఉన్నత స్థాయి ప్రతినిధులతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.

**ఏపీలో ఏఐ, డిజిటల్ విప్లవం... గూగుల్‌తో భాగస్వామ్యం**

ముందుగా గూగుల్ క్లౌడ్ ఆసియా-పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సెంటర్, డిజిటల్ మౌలిక సదుపాయాల కేంద్రంగా అభివృద్ధి చేసే అంశంపై ఇరువురు ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ రంగాల్లో గూగుల్ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు వీలుగా ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు ఏఐ టెక్నాలజీని వినియోగించుకోవడంలో సహకరించాలని చంద్రబాబు గూగుల్ క్లౌడ్‌ను కోరారు. గతంలో తాను ప్రవేశపెట్టిన రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్‌టీజీఎస్) వ్యవస్థను ఆధునిక క్లౌడ్ టెక్నాలజీలతో మరింత శక్తివంతం చేయడంపై చర్చించారు. రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీలలో భారీ స్థాయిలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రతిపాదించారు. విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలల్లో గూగుల్ సహకారంతో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ రంగంలో సాధించిన విజయాలను వివరిస్తూ, ప్రభుత్వం నిర్వహిస్తున్న ‘సంజీవని’ ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని గూగుల్‌ను ఆహ్వానించారు.

**అమరావతిలో సింగపూర్ వర్సిటీ... విద్యారంగంలో ముందడుగు**

అనంతరం, సింగపూర్ జాతీయ విశ్వవిద్యాలయం (ఎన్‌యూఎస్) ప్రెసిడెంట్ టాన్ ఎంగ్ చేయ్‌తో, ఆయన బృందంతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. అమరావతిని ప్రపంచ స్థాయి విద్యా కేంద్రంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా అమరావతిలో ఎన్‌యూఎస్ అంతర్జాతీయ బ్రాంచ్ లేదా శాటిలైట్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలు రాజధాని ప్రాంతంలో తమ కార్యకలాపాలు ప్రారంభించాయని గుర్తుచేశారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం వ్యాలీలో ప్రపంచ స్థాయి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సాంకేతిక, పరిశోధన సహకారాన్ని అందించాలని ఎన్‌యూఎస్‌ను కోరారు. అలాగే, గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆకర్షించేలా సరికొత్త విధానాల రూపకల్పనలో ఎన్‌యూఎస్‌కు చెందిన పాలసీ ఇన్‌స్టిట్యూట్ సహకారం తీసుకోవాలని ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా ఎన్‌యూఎస్ ప్రతినిధులు అమరావతి నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో తమ భాగస్వామ్యాన్ని పలువురు ప్రొఫెసర్లు గుర్తు చేసుకున్నారు. అమరావతిలో క్యాంపస్ ఏర్పాటు చేయాలన్న ముఖ్యమంత్రి ప్రతిపాదనపై తమ బోర్డులో చర్చిస్తామని ఎన్‌యూఎస్ ప్రెసిడెంట్ టాన్ ఎంగ్ చేయ్ హామీ ఇచ్చారు. ఈ సమావేశాలతో ఏపీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు చంద్రబాబు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

# టెక్నాలజీ, ఎయిర్ కనెక్టివిటీ.. సింగపూర్ పర్యటనలో చంద్రబాబు కీలక భేటీలు

మొదటిపేజీ తరువాయి – కీలక సమావేశాల్లో పాల్గొన్నారు. తన రెండు రోజుల పర్యటనలో భాగంగా ఇవాళ, సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో భేటీ అనంతరం ఆ దేశ విదేశీ వ్యవహారాల మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్-సింగపూర్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్య బలోపేతంపై ఇరువురు నేతలు ప్రధానంగా చర్చించారు. ముఖ్యంగా ఏపీలోని విమానాశ్రయాల నుంచి సింగపూర్‌కు, అలాగే ఇతర ప్రాంతాలకు విమాన సర్వీసులు, ఎయిర్ కనెక్టివిటీని పెంచే అవకాశాలపై ఫలవంతమైన చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అందిస్తున్న అవకాశాలను సింగపూర్ విదేశాంగ మంత్రికి వివరించారు. అమరావతి రాజధాని నిర్మాణ ప్రణాళికలను, దాని భవిష్యత్ దార్శనికతను ఆయనకు తెలియజేశారు. తయారీ రంగంతో పాటు సేవల రంగంలోనూ ఆంధ్రప్రదేశ్ వేగంగా అగ్రగామి రాష్ట్రంగా ఎదుగుతోందని తెలిపారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూమి లభ్యతతో పాటు, సేవల రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఏపీలో పుష్కలంగా ఉన్నాయని వివరించారు. రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతం, పోర్టుల ద్వారా సరకు రవాణాకు ఉన్న అనుకూలతలను ప్రస్తావించారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ హైడ్రోజన్ తయారీలో ఏపీ దేశంలోనే కీలక పాత్ర పోషించనుందని స్పష్టం చేశారు. విశాఖలో డేటా సెంటర్ ఎకోసిస్టమ్ ఏర్పాటు, ప్రపంచంతో ఏపీని అనుసంధానించే సబ్-సీ కేబుల్ ప్రాజెక్టుల గురించి తెలిపారు. అమరావతిని ‘క్వాంటం వ్యాలీ’గా తీర్చిదిద్దుతున్నామని, ఉత్తరాంధ్రలో ప్రపంచ దిగ్గజ ఉక్కు సంస్థ ఆర్సెలార్ మిట్టల్ భారీ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశానికి ముందు, ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్‌తో ఆయన అధికారిక నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దాదాపు 30 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల మధ్య సహకారానికి సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించారు. అమరావతి సహా రాష్ట్రంలోని ఇతర నగరాలు, పట్టణాల్లో అర్బన్ గవర్నెన్స్‌లో సింగపూర్ నైపుణ్యాన్ని, సహకారాన్ని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. టెక్నాలజీ, సెమీకండక్టర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి అధునాతన రంగాలతో పాటు యూనివర్సిటీల్లో పరిశోధనలకు తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా సెమీ కండక్టర్ల తయారీకి అవసరమైన ఎకోసిస్టమ్, కెపాసిటీ బిల్డింగ్‌లో సహకరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తున్న పంటల గురించి సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో పండిస్తున్న ఉద్యాన, ఆక్వా ఉత్పత్తులను సింగపూర్ దిగుమతి చేసుకునే అంశాన్ని పరిశీలించాలని కోరారు. ఈ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. పోర్టులు, ఎయిర్‌పోర్టుల అభివృద్ధి ద్వారా రెండు ప్రాంతాలు కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ చర్చల సందర్భంగా సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్, అమరావతి రాజధాని నిర్మాణం గురించి ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. రాజధానిలో ఏర్పాటు చేయనున్న అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు, మౌలిక సదుపాయాల గురించి ఆసక్తి కనబరిచారు. దీనికి చంద్రబాబు బదులిస్తూ, ప్రపంచంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరాల్లో ఒకటిగా అమరావతి నిలవనుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ సమావేశాల్లో సీఎం వెంట రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, సింగపూర్‌లో భారత హై కమిషనర్ శిల్పక్ అంబులే తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమాసియాలో శాంతికి మార్గం

మొదటిపేజీ తరువాయి – విస్తృత యుద్ధ భయాలకు కారణమైన ఈ వివాదం ముగింపు దిశగా సాగడం ఒక ముఖ్యమైన పరిణామం. అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందం పూర్తయినట్టు ప్రకటన చేశారు. చరిత్రాత్మక దౌత్య విజయంగా అభివర్ణిస్తూ, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని ముగించడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని తెలిపారు. “ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! హర్మూజ్ జలసంధిని టోల్ లేకుండా తిరిగి తెరిచేందుకు నేను పూర్తి అధికారం ఇస్తున్నాను. అదే సమయంలో అమెరికా నౌకా దిగ్బంధనాన్ని తక్షణమే తొలగించాలని ఆదేశిస్తున్నాను. ప్రపంచ నౌకలారా, మీ ఇంజిన్లు ప్రారంభించండి” అని ట్రంప్ తన ‘ట్రూత్ సోషల్’ ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ ఒప్పందంపై ప్రధాని మోదీ ‘ఎక్స్’ వేదికగా స్పందించారు. “ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక అంతరాయానికి, అనేక దేశాల్లో ప్రాణనష్టానికి కారణమైన పశ్చిమాసియా వివాదానికి ముగింపు పలికేందుకు అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన అవగాహనను నేను స్వాగతిస్తున్నాను. ఈ ఒప్పందం అమలుతో ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం పునరుద్ధరించడంతో పాటు నౌకాయాన స్వేచ్ఛ, వాణిజ్యం సజావుగా సాగుతాయని భారత్ ఆశిస్తోంది. మిగిలిన అంశాలపై కూడా చర్చలు జరిగి, సుస్థిరమైన తుది ఒప్పందం కుదురుతుందని ఎదురుచూస్తున్నాం” అని పేర్కొన్నారు. మరో పోస్టులో ట్రంప్ ఈ ఒప్పందాన్ని చారిత్రక విజయంగా అభివర్ణించారు. “ఈ గొప్ప ఒప్పందం మొత్తం ప్రాంతానికి శాంతి, భద్రతను తెస్తుంది. గతంలో ఎందరో అధ్యక్షులు ఇరాన్‌తో శాంతి నెలకొల్పేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ ప్రాంత నాయకులు, నిజమైన శాంతిని సాధించడంలో సహాయపడగల అధ్యక్షుడిని మొదటిసారి కనుగొన్నారు” అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంపై శుక్రవారం అధికారికంగా సంతకాలు జరుగుతాయని, జలమార్గంలోని మైన్‌లను తొలగించే ప్రక్రియతో పాటే జలసంధిని తిరిగి తెరుస్తారని ట్రంప్ తెలిపారు. అయితే, ఈ ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలను ట్రంప్ వెల్లడించలేదు. వైట్ హౌస్ నుంచి కూడా అధికారికంగా ఎలాంటి పత్రాలు విడుదల కాలేదు. ఇరాన్ అణు కార్యక్రమం, అమెరికా విధించిన ఆంక్షల వంటి దీర్ఘకాలిక సమస్యలపై ట్రంప్ తన పోస్టులలో ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం గమనార్హం. ప్రస్తుతానికి మాత్రం హోర్ముజ్ జలసంధి ద్వారా వాణిజ్య నౌకల స్వేచ్ఛాయుత రవాణాను పునరుద్ధరించడమే ఈ ఒప్పందం తక్షణ లక్ష్యంగా కనిపిస్తోంది.

## 71 సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా ‘పెద్దన్న’ను ఒప్పించలేకపోయారు

మొదటిపేజీ తరువాయి – ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని ఆయన సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే సీఎం నిరాధార ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. యూపీ, అహ్మదాబాద్, విశాఖపట్నం వంటి నగరాలకు కేంద్రం మెట్రో ప్రాజెక్టులు మంజూరు చేస్తుంటే, హైదరాబాద్‌కు ఎందుకు తేలేకపోయారో రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 71 సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా తన ‘పెద్దన్న’ను (మోదీ) ఒప్పించలేకపోవడం ఆయన చేతకానితనానికి నిలువెత్తు నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఓటుకు నోటు కేసు ఉచ్చు బిగుస్తోందన్న భయంతోనే రేవంత్ రెడ్డి బీజేపీతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. అందుకే మెట్రో విస్తరణను నిరాకరిస్తున్న ప్రధానిని, కేంద్రాన్ని విమర్శించే ధైర్యం, దమ్ము ఆయనకు లేవని అన్నారు. కేసీఆర్ సమర్థ నాయకత్వంలో ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు వస్తే, ఈ అసమర్థ పాలనలో అన్నీ నిలిచిపోయాయని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఢిల్లీలో తనను ‘చెప్పుల దొంగ’లా చూస్తున్నారని రేవంత్ రెడ్డే స్వయంగా చెప్పడం ఆయన అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని కేటీఆర్ అన్నారు. మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టును సాధించడంలో విఫలమైనందుకు సీఎం తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ‘మినీ ఇండియా’ లాంటి హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీ సర్వనాశనం కావడం ఖాయమని హెచ్చరించారు.

## మెట్రో నిధులు రూ.13,600 కోట్లు ఇవ్వండి



మొదటిపేజీ తరువాయి – మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, మెట్రో ఫేజ్-2 నిర్మాణంలో కేంద్రం భాగస్వామిగా ఉంటుందో లేదో స్పష్టం చేయాలని, లేదంటే రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా పనులు చేపట్టేందుకు నిరభ్యంతర పత్రం (చీూజ) ఇవ్వాలని కోరారు. ఎల్‌డటీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం మెట్రో ఫేజ్-1ను స్వాధీనం చేసుకున్న తర్వాత, అధిక వడ్డీ భారాన్ని తగ్గించుకునేందుకు జపాన్ ఏజెన్సీ నుంచి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (×=ఖీజ) ద్వారా తక్కువ వడ్డీకి రుణం పొందినట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. జపాన్ ఏజెన్సీ ఇప్పటికే నిధులను ×=ఖీజకి బదిలీ చేసిందని, కానీ జూన్ 1న రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన ఆ మొత్తాన్ని కేంద్రం అడ్డుకుంటోందని ఆరోపించారు. ఈ వ్యవహారం వెనుక కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణకు నిధులు రాకుండా అడ్డుకోవాలని కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రులు మనోహర్ లాల్, అశ్విని వైష్ణవ్‌లను కలిసి కోరారని విమర్శించారు. “ఈ రోజు తెలంగాణకు రావాల్సిన రూ. 13,600 కోట్లను విడుదల చేసే బాధ్యతను కిషన్ రెడ్డి తీసుకుంటారా?” అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎల్‌డటీ సంస్థ ఫేజ్-1లో ఏటా రూ.400 కోట్ల నష్టాలను చవిచూస్తోందని, దీంతో వారు ఫేజ్-2 నిర్మాణానికి అంగీకరించలేదని రేవంత్ గుర్తుచేశారు. కేంద్రం సూచన మేరకే రాష్ట్ర ప్రభుత్వం మెట్రోను టేకోవర్ చేసిందని, ఇప్పుడు నిధులు రాకుండా అడ్డుకోవడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ జోక్యం చేసుకుని తెలంగాణకు న్యాయంగా రావాల్సిన నిధులను విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## దేశ ప్రగతికి అంకితభావంతో పనిచేస్తున్నారు

మొదటిపేజీ తరువాయి – నరేంద్ర మోదీ ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారు. దేశ ప్రగతి కోసం అంకితభావంతో పనిచేసే నాయకుడిగా ఆయన్ను అభివర్ణించారు. బొగ్గు, గనుల రంగాల బలోపేతానికి కిషన్‌రెడ్డి చేస్తున్న కృషిని కొనియాడారు. సోమవారం ‘ఎక్స్’ వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మోదీ.. కిషన్‌రెడ్డి కష్టపడి పనిచేసే నాయకుడని పేర్కొన్నారు. సంస్కరణలు, విధానపరమైన చర్యల ద్వారా బొగ్గు, గనుల రంగాల్లో మార్పు తీసుకురావడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారని కొనియాడారు. కిషన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. దేశాన్ని ఇంధన రంగంలో స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దాలన్న మోదీ లక్ష్యాన్ని సాకారం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం కిషన్‌రెడ్డి సేవలను ప్రశంసించారు. బొగ్గు, గనుల రంగాల అభివృద్ధి, ఆధునికీకరణ కోసం ఆయన చేస్తున్న కృషి దేశ పురోగతికి దోహదపడుతోందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ప్రహ్లాద్ జోషి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు ప్రముఖులు కూడా కిషన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఏపీ, తెలంగాణలకు చల్లని కబురు: హైదరాబాద్‌ను తాకిన నైరుతి

**హైదరాబాద్‌లోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు**

**మరో 4-5 రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో పూర్తిస్థాయి విస్తరణ**

**భద్రాద్రి కొత్తగూడెం, కళింగపట్నం వరకు చేరిన రుతుపవనాలు**

**ముందుకు కదిలేందుకు అనుకూలంగా ఉన్న పరిస్థితులు**

**భారత వాతావరణ శాఖ అధికారిక ప్రకటన**



నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా చురుగ్గా పురోగమిస్తున్నాయి. ఇవి తాజాగా తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోకి ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. రానున్న 4 నుంచి 5 రోజుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని మిగిలిన ప్రాంతాలన్నింటికీ రుతుపవనాలు విస్తరించడానికి పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయని పేర్కొంది. ఆదివారం నాటికి రుతుపవనాల ఉత్తర సరిహద్దు (నార్తర్న్ లిమిట్ ఆఫ్ మాన్‌సూన్) మహారాష్ట్రలోని హర్నై, సోలాపూర్ మీదుగా ప్రయాణిస్తూ.. తెలంగాణలోని హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్‌లోని కళింగపట్నం వరకు విస్తరించినట్లు వాతావరణ శాఖ తెలిపింది. అక్కడి నుంచి పారాదీప్, బరిపద, ధన్‌బాద్ మీదుగా ముజఫర్‌పూర్ వరకు రుతుపవనాల విస్తరణ కొనసాగుతున్నట్లు స్పష్టం చేసింది. రానున్న 4-5 రోజుల్లో కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని మిగిలిన ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లోని మరికొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించనున్నాయి. అలాగే ఒడిశా, ఝార్ఖండ్, బీహార్, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లోకి కూడా ఇవి ప్రవేశించే అవకాశం ఉందని ఐఎండీ తన తాజా బులెటిన్‌లో వివరించింది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాకాలం పూర్తిస్థాయిలో ప్రారంభం కానుంది.

## డిప్యూటీ సి.యం మల్లు బట్టి విక్రమార్కకి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేసిన కూకట్పల్లి నియోజకవర్గం ఐ.యన్.టి.యు.సి అధ్యక్షులు కర్క నాగరాజు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూన్ 15:** జన హృదయ నేత, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కూకట్పల్లి నియోజకవర్గం ఐ.యన్.టి.యు.సి అధ్యక్షులు , ఆల్ ఇండియా అంబేద్కర్ యువజనసంగం ౘాఖ౾ా గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కర్కనాగరాజు వారి నివాసమైన ప్రజాభవన్ కు వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూల భోకేతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాలమహానాడు అధ్యక్షులు జి.చెన్నయ్య, రమేష్ పాటిల్, కర్కమహేష్,తదితరులు పాల్గొన్నారు.

## మందలపు సాయిబాబా చౌదరి జన్మదినోత్సవాన్ని (సేవే పరమో ధర్మః -- జన్మదినాన్ని సేవా..) దినోత్సవంగా మార్చిన స్నేహితులు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూన్ 15:** కేపిహెచ్‌బీ కాలనీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి జన్మదినాన్ని పురస్కరించుకుని ఖమ్మం జిల్లాలోని ఖమ్మం పట్టణంలో ఆయన స్నేహితులు ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయిబాబు చౌదరి సాయిబాబా భక్తుడిగా ఉండటంతో, సత్యసాయి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో సుమారు 500 మంది రోగులు, వారి సహాయకులు, నిరుపేద ప్రజలకు అన్నదానం చేశారు. అలాగే పాఠశాల విద్యార్థులకు కూడా భోజనాలను పంపిణీ చేసి మానవతా విలువలను చాటిచెప్పారు. ఈ సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం మేయర్ నీరజ , కార్పొరేటర్ మందడపు మనోహర్ , ఇతర ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని అభినందించారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం సమాజానికి ఆదర్శమని వారు పేర్కొన్నారు. స్నేహితులు ఆచూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మందలపు సాయిబాబు చౌదరి సేవా కార్యక్రమాలను కొనియాడుతూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు.

**కోటేషన్:** జన్మదినం అంటే వయస్సు పెరగడం కాదు... మన వల్ల మరొకరి జీవితంలో చిరునవ్వు పెరగడం. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కంటే గొప్ప వేడుక మరొకటి లేదు. మందలపు సాయిబాబు చౌదరికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన సమాజ సేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్నేహితులు, అభిమానులు ఆకాంక్షించారు.

## ప్రతి పోలీస్ స్టేషన్‌కు 'పోలీస్ మెంటార్': వీసీ సజ్జనార్




**నిజం న్యూస్ హైదరాబాద్, జూన్ 15ప్రతి పోలీస్ స్టేషన్‌కు 'పోలీస్ మెంటార్':** వీసీ సజ్జనార్ తెలంగాణ : హైదరాబాద్‌లో ప్రజా భద్రత, మహిళా రక్షణను బలోపేతం చేసేందుకు, పౌరుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు సరికొత్త సంస్కరణలు చేపడుతున్నట్లు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కానిస్టేబుల్‌ను 'పోలీస్ మెంటార్'గా నియమించనున్నట్లు ప్రకటించారు. మహిళలు తమ సమస్యలను భయం లేకుండా వెల్లడించేందుకు "స్పందన – ఆల్ ఉమెన్ ఫస్ట్ రెస్పాండర్ సిస్టమ్"ను అందుబాటులోకి తెచ్చినట్లు సీపీ తెలిపారు.

## కాంగ్రెస్ తీరు ఇప్పటికీ మారలేదు: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**నిజం న్యూస్ ఆంధ్రప్రదేశ్, జూన్ 15:** ఢిల్లీ వేదికగా జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన సేన ప్రస్థానం. దేశ సమగ్రత కోసం సేనా ప్రస్థానం కార్యక్రమంలో పాల్గొన్న పవన్ కల్యాణ్, తెలంగాణ ఏర్పాటు, కాంగ్రెస్ నేతల తీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ సమగ్రత జనసేన సిద్ధాంతమని, దేశ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడమే జనసేన లక్ష్యమని, అందుకే ఢిల్లీలో ఈ సమావేశం ఏర్పాటు చేశామని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. అలాగే జనసేన పార్టీ ఎప్పుడు తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకంగా కాదని, విభజన చేసిన తీరుకు తాము వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. అలాగే జనసేన పార్టీ సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందని, తమను అడ్డుకునేందుకే ప్రయత్నించిన కాంగ్రెస్ పార్టీ నేతలు తమపై తీవ్ర విమర్శలు చేశారని, నేటికి కూడా కాంగ్రెస్ తీరు మారలేదని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. అలాగే సేనా ప్రస్థానం లక్ష్యాలను పార్టీ కార్యకర్థకలకు, నేతలకు వివరించారు. జనసేన పార్టీకి ఎల్లప్పుడూ సొంత ప్రయోజనాల కంటే దేశ సమగ్రత, శ్రేయస్సే అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. దేశ స్ఫూర్తిని, జాతీయ సమైక్యతను కాపాడుకోవడం అనేది ఒక్కరోజుతో ముగిసే పనికాదని, ప్రతి తరం దీనిని బాధ్యతగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని విభజించిన అనాలోచిత తీరు వల్ల రెండు ప్రాంతాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, అశాంతి నెలకొన్నాయని.. ఆ తప్పుడు విభజన వల్లే నేటికీ రెండు రాష్ట్రాల మధ్య ఆస్తుల పంపిణీ సహా పలు వివాదాలు నలుగుతూనే ఉన్నాయని ఆయన పవన్ కల్యాణ్ తప్పుపట్టారు. విభజన శక్తులపై రాజీలేని పోరాటం చేయడమే తెలంగాణలో జనసేన ప్రస్థానం ప్రారంభించినప్పటి నుంచి తమకున్న ఏకైక నిబద్ధత అని గుర్తుచేశారు. అలాగే సొంత రాష్ట్రాల్లో 'ఢిల్లీ మెడలు వంచుతాం' అంటూ ప్రగల్భాలు పలికే నాయకులు, తీరా ఇక్కడికి రాగానే నోరు విప్పలేకపోతున్నారంటూ పరోక్షంగా ఇతర రాజకీయ పక్షాలపై పవన్ కల్యాణ్ పదునైన విమర్శలు గుప్పించారు.

## మెట్రో రెండవ దశకి అనుమతి దక్కకపోవడం రేవంత్ రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శనం



**నిజం న్యూస్ హైదరాబాద్, జూన్ 15:** ఓటుకు నోటు కేసు వల్లనే రేవంత్ రెడ్డి కేంద్రాన్ని ప్రశ్నించలేని అసమర్థతలో ఉన్నాడు 71సార్లు ఢిల్లీకి వెళ్లినా కేంద్రం రేవంత్ రెడ్డిని దేకడం లేదు మెట్రో రెండో దశను సాధించడంలో అట్టర్ ఫ్లాప్ అయినందుకు.. మొదటి దశను ఆగం చేస్తున్నందుకు రేవంత్ రెడ్డి వెంటనే ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలి హైదరాబాద్ మెట్రో రైల్ పూర్తి చేసిన ఘనత ముమ్మాటికి కేసీఆర్ దే 28 శాతం మెట్రో పనులు కూడా పూర్తి చేయకుండా ప్రాజెక్టును చిక్కుల్లో వదిలేసిన ఆనాటి కాంగ్రెస్ 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే కేసీఆర్ చొరవ తీసుకుని 72 శాతం పనులను పూర్తి చేశారూడు సంస్థపై బెదిరింపులతో ఆ సంస్థ వెళ్లిపోయింది.. ఇప్పుడు మెట్రో రైల్ ఆస్తులు కొల్లగొట్టే కుట్ర చేస్తున్నారు

# సబిత ఇంద్ర రెడ్డికి ఆత్మీయ అభినందన సభ







**నిజం న్యూస్ బాలాపూర్, జూన్ 15:** జిహెచ్ఎంసి 60వ డివిజన్ మీర్ పేట్ పరిధిలోని శ్రీరస్తు కన్వెన్షన్ హాల్లో సాయి సామ్రాట్ నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ అభినందన సభలో ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని సాయి సామ్రాట్ నగర్ కాలనీవాసులు అలాగే స్థానిక మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్ ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ శ్రీ సాయి సామ్రాట్ నగర్ కాలనీలో కొన్ని సంవత్సరాల నుండి నెలకొన్న దీర్ఘకాలిక భూగర్భ డ్రైనేజీ ఔట్లెట్ సమస్యను 25 లక్షల నిధులతో శాశ్వతంగా పరిష్కరించిన సబితా ఇంద్రారెడ్డికి రుణపడి ఉంటామని, తన నియోజకవర్గంలో ఎక్కడ సమస్య ఉంటే అక్కడ సబితమ్మ ఉండి పరిష్కరిస్తుందని ప్రసంగించారు. సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ నేను నా భాధ్యతగా చేసిన కొంత అభివృద్ధికే నన్ను ఇంత పెద్ద ఎత్తున సన్మానించిన కాలనీవాసులకు మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్ కు మాజీ యంపిటిసి ఎనుగుల అనిత యాదవ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, రాష్ట్ర బంజారా నాయకులు దీప్లాల్ చౌహాన్, మాజీ కార్పొరేటర్ సిద్ధాల లావణ్య బీరప్ప, ధనలక్ష్మి రాజ్ కుమార్, సిద్ధల లార్డ్స్ బీరప్ప, మాదరి రమేశ్, లక్ష్మణ్ ముదిరాజ్, మీర్ పేట్ బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు కామేష్ రెడ్డి, మాజీ మహిళా అధ్యక్షురాలు సునీత బాలరాజ్, మాజీ కోఆప్షన్ సభ్యులు రజాక్, మాజీ టెంపుల్ డైరెక్టర్లు మేకల యాదగిరి, సుర్వీలత శేఖర్ గౌడ్, జ్ఞానేశ్వర్ చారి, గ్రంథాలయ మాజీ డైరెక్టర్ పంతంగి మాధవి, మాజీ ఎంపీటీసీ లలిత జగన్, కంటెస్టెంట్ కార్పొరేటర్ అబ్బనమోని గోపి యాదవ్, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సిరూర్ బాలరాజ్, శ్రీనివాస్ గుప్తా, రవిందర్ రెడ్డి, నాయకులు సిద్దాల భరత్, బొమ్మని సుదర్శన్, అవినాష్ కర్రే వెంకటేష్, పుప్పాల రామకృష్ణ, రామన్ యాదవ్, పుప్పాల చరణ్ ఉద్యమకారులు హనుమంతరావు, మహిళా నాయకురాళ్ళు బిందు, నిర్మల, గీత, సరిత, పద్మ సాయి సామ్రాట్ నగర్ కాలనీ అధ్యక్షులు దారాల మధు మరియు కాలనీ వాసులు వివిధ కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కేపీహెచ్‌బీ కాలనీలో ఘనంగా మందలపు సాయిబాబు చౌదరి 51వ జన్మదిన వేడుకలు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూన్ 15:** సోమవారం కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజామనిషి, సామాజిక సేవకులు లిమందలపు సాయిబాబు చౌదరిలి 51వ జన్మదిన వేడుకలు ఆయన అభిమానులు, అనుచరులు, మిత్రులు , స్థానిక ప్రజల సమక్షంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో కేక్ కట్ చేసి, పుష్పగుచ్ఛాలు, గజమాలలతో సన్మానించారు. బాణాసంచా కాల్చి, నినాదాలతో జన్మదిన వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ మందలపు సాయిబాబు చౌదరి గత 25 సంవత్సరాలుగా ప్రజల మధ్య ఉంటూ ప్రజా సేవకు అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. కరోనా కాలంలో నిత్యావసర సరుకుల పంపిణీ, వరదలు మరియు ఇతర ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యలు, పేదలకు వైద్య సహాయం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ స్వయంగా మందలపు సాయిబాబు చౌదరి కి బొకే అందజేసి, శాలువాతో సత్కరించి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, "మందలపు సాయిబాబు చౌదరి ప్రజల కోసం నిరంతరం సేవ చేస్తున్న నాయకుడు. రాబోయే రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, ఇంకా ఎక్కువ సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మరింత చేరువ కావాలని కోరుకుంటున్నాను. సమాజానికి ఆయన చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమైనవి"లిలి అని పేర్కొన్నారు. అలాగే ఆయనకు ఆశీర్వాదాలు అందజేస్తూ, ఆయురారోగ్యాలతో నిండి ప్రజాసేవలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం అభిమానులు, మిత్రులు, ప్రజాప్రతినిధులు మరియు వివిధ సంఘాల నాయకులు మందలపు సాయిబాబు చౌదరి కి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు. వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ముగిశాయి.

# బీఆర్ఎస్‌ను ట్రాక్‌లోకి తెచ్చేందుకు బస్సు యాత్ర

ఎన్నికలకు క్యాడర్ ను రెడీ చేయడమే లక్ష్యం
సవాళ్లకు దూరంగా గులాబీ బాస్
బస్సు యాత్రతో ప్రజల్ని ఆకట్టుకోగలరా?
బీఆర్ఎస్ పుంజుకోవడమే కీలకం
రంగంలోకి కేసీఆర్ – ఎప్పుడంటే ?



**నిజం న్యూస్ హైదరాబాద్, జూన్ 15:** తెలంగాణ రాజకీయాల్లో భారత్ రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మళ్లీ యాక్టివ్ కాబోతున్నారనే వార్తలు గులాబీ శ్రేణుల్లో కొత్త జోష్ నింపుతున్నాయి. కేసీఆర్ త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టబోతున్నారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించడంతో పొలిటికల్ సర్కిల్స్లో సరికొత్త చర్చ మొదలైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, ఆ వెంటనే జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బస్సు యాత్ర చేసినప్పటికీ పార్టీ ఖాతాలో ఒక్క సీటు కూడా పడకుండా జీరో ఫలితం రావడం కేసీఆర్ను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఆ దెబ్బతో దాదాపు రెండేళ్లకు పైగా ఆయన ఫామ్హౌస్కే పరిమితమయ్యారు. కేవలం ఇటీవల జరిగిన పార్టీ ప్లీనరీ, అలాగే జగిత్యాల లాంటి రెండు బహిరంగ సభల్లో మాత్రమే ఆయన ప్రసంగించి వెళ్లారు తప్ప క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి రాలేదు.

**ఎన్నికలకు క్యాడర్ ను రెడీ చేయడమే లక్ష్యం**

ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళు దాటిపోతున్న తరుణంలో.. కేసీఆర్ ఇప్పుడు బస్సు యాత్ర అస్త్రం చేతబట్టడం వెనుక కేవలం పార్టీ ఉనికిని చాటుకోవడమే కాకుండా, రాబోయే స్థానిక సంస్థలు లేదా సార్వత్రిక ఎన్నికల కోసం క్యాడర్ను సమాయత్తం చేయడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే, రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. కేసీఆర్ ఈ యాత్ర పూర్తి చేసిన తర్వాత మళ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేంతవరకు ప్రజల్లోకి వచ్చే అవకాశాలు తక్కువే. అంతేకాదు, ఆయన ఇకపై అసెంబ్లీ సమావేశాలకు కూడా వచ్చే మూడ్లో లేరని స్పష్టమవుతోంది. సభలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టే పూర్తి భారాన్ని ఆయన కేటీఆర్, తన్నీరు హరీష్ రావుల భుజాలపైనే పెట్టేశారు. అసెంబ్లీ వేదికగా గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై, అలాగే ప్రస్తుత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సవాల్ విసిరినా కేసీఆర్ సైలెంట్గా ఉండటం వెనుక పెద్ద వ్యూహమే ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిత్యం వేస్తున్న పొలిటికల్ సవాళ్లకు సమాధానం ఇచ్చేందుకు కేసీఆర్ ఏమాత్రం ఆసక్తి చూపించడం లేదు. తన స్థాయికి రేవంత్ రెడ్డి సరిపోరు, జూనియర్ నేతతో తాను నేరుగా తలపడటం వల్ల ఆయనకే ఎక్కువ పొలిటికల్ మైలేజ్ లభిస్తుంది అనే భావనలో కేసీఆర్ ఉన్నట్లు ప్యానల్ ఎక్స్పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. అందుకే, రేవంత్ రెడ్డిని ఢీకొట్టే బాధ్యతలను కేటీఆర్, హరీష్ రావులకు వదిలేసి.. తాను మాత్రం కేవలం ప్రజాక్షేత్రం లోనే తేల్చుకోవాలనే పంథాను ఎంచుకున్నారు.

**బస్సు యాత్రతో ప్రజల్ని ఆకట్టుకోగలరా?**

ఇక్కడ అసలైన ప్రశ్న ఏమిటంటే.. గతంలో ఫ్లాప్ అయిన బస్సు యాత్ర ఫార్ములాతో కేసీఆర్ మళ్లీ ప్రజలను ఆకట్టుకోగలరా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నే. అసెంబ్లీ ఓటమి తర్వాత బీఆర్ఎస్ ఓటు బ్యాంకు దారుణంగా చెల్లాచెదురైంది. అటు బీజేపీలోకి, ఇటు కాంగ్రెస్లోకి కీలక నేతలు, కేడర్ వలస వెళ్లడంతో గులాబీ కోట బలహీనపడింది. ప్రస్తుతం కాంగ్రెస్ హామీల అమలులో జరుగుతున్న జాప్యం, ప్రజల్లో కనిపిస్తున్న చిన్నపాటి అసంతృప్తిని క్యాష్ చేసుకోవడానికి కేసీఆర్ వాగ్ధాటి ఉపయోగపడుతుందని భావిస్తున్నప్పటికీ.. జనం గతాన్ని అంత సులభంగా మర్చిపోతారా అనేది అనుమానమే.

**బీఆర్ఎస్ పుంజుకోవడమే కీలకం**

కేసీఆర్ బస్సు యాత్ర కేవలం ఒక ప్రచార పర్వం మాత్రమే కాదు, అది బీఆర్ఎస్ పార్టీకి జీవన్మరణ సమస్య. కేటీఆర్, హరీష్ రావు ఎంతగా కష్టపడుతున్నా.. పార్టీని నడిపించే కరిష్మా కేవలం కేసీఆర్కు మాత్రమే ఉంది. ఈ యాత్ర ద్వారా ఆయన తన పాత ఓటు బ్యాంకును తిరిగి రాబట్టుకోగలిగితే తెలంగాణలో మళ్లీ ముక్కోణపు పోటీ వస్తుంది; లేదంటే తెలంగాణ రాజకీయం కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా మారిపోయి బీఆర్ఎస్ మరింత మూలనపడే ప్రమాదం ఉంది. అందుకే కేసీఆర్ సీరియస్గా ఈ యాత్ర చేసే అవకాశాలు ఉన్నాయి.

# చిన్న మొత్తాలతో గాలం... పెద్ద మొత్తాలకు టోకరా!



**నిజం న్యూస్ సైబరాబాద్, జూన్ 15:** "రోజుకు వేల రూపాయల ఆదాయం", "కొద్దిరోజుల్లో డబ్బు రెట్టింపు", "టాస్క్ పూర్తి చేస్తే భారీ కమిషన్", "ట్రేడింగ్ ద్వారా ఖచ్చితమైన లాభాలు" వంటి ఆకర్షణీయమైన ఆఫర్లతో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారు. ముఖ్యంగా టెలిగ్రామ్ గ్రూపులు, నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫార్ములు, ఫేక్ వెబ్‌సైట్ల ద్వారా అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. మోసం ఎలా జరుగుతోంది? సైబర్ నేరగాళ్లు ముందుగా సోషల్ మీడియా లేదా టెలిగ్రామ్ ద్వారా బాధితులను సంప్రదించి ప్రత్యేక గ్రూపుల్లో చేర్చుకుంటారు. ఆ గ్రూపుల్లో అంతర్జాతీయ కంపెనీలు, ప్రముఖ హోటళ్లు, రిసార్టులు లేదా పెద్ద బ్రాండ్ల ప్రతినిధులమని చెప్పుకుంటూ నమ్మకం కల్పిస్తారు. పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో మొదట చిన్న చిన్న మొత్తాలను పెట్టుబడిగా పెట్టించి, కొంత లాభం వచ్చినట్లు ఆశ చూపించి, తర్వాత పెద్ద మొత్తంలో డబ్బును పెట్టుబడి పెట్టేలా ప్రలోభపెడుతున్నారు. ఈ మోసాల్లో భాగంగా 'ప్రొడక్ట్ ప్రమోషన్', 'ఆన్‌లైన్ టాస్క్‌లు', 'ఆర్డర్ బుకింగ్', 'ట్రేడింగ్ కార్యకలాపాలు' వంటి పనులు చేస్తే అధిక కమిషన్ లేదా లాభాలు వస్తాయని నమ్మిస్తారు. ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్ లేదా ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్‌లో నమోదు చేయించి, మొదట చిన్న మొత్తాలను పెట్టుబడిగా పెట్టిస్తారు. మొదట కొన్ని వందలు లేదా వేల రూపాయలు చెల్లించి నిజంగా లాభాలు వస్తున్నాయనే నమ్మకం కల్పిస్తారు. ఆ తర్వాత మరింత అధిక లాభాలు వస్తాయని ఆశ చూపిస్తూ లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహిస్తారు. బాధితుడు పెట్టుబడులు పెంచిన కొద్దీ నకిలీ వెబ్‌సైట్‌లో భారీ లాభాలు వచ్చినట్లు చూపిస్తారు. కానీ డబ్బు విత్‌డ్రా చేసుకునే సమయంలో కొత్త కొత్త నిబంధనలు తెరపైకి తీసుకొస్తారు.

ఖాతాలో లాభాలు కనిపిస్తాయి... కానీ డబ్బులు రావు!

నకిలీ ట్రేడింగ్ లేదా పార్ట్‌టైమ్ జాబ్ వెబ్‌సైట్లలో భారీ లాభాలు వచ్చినట్లు చూపిస్తారు. అయితే డబ్బు విత్‌డ్రా చేసుకునే సమయంలో కొత్త కొత్త కారణాలు చెబుతారు. డబ్బు ఉపసంహరించుకోవాలంటే "అకౌంట్ వెరిఫికేషన్ ఫీజు", "ట్యాక్స్ క్లియరెన్స్", "సెక్యూరిటీ డిపాజిట్", "వీఐపీ అప్‌గ్రేడ్", "విత్‌డ్రా అన్‌లాక్ ఛార్జీలు" వంటి పేర్లతో మరిన్ని చెల్లింపులు చేయాలని డిమాండ్ చేస్తారు.

ఇప్పటికే పెద్ద మొత్తంలో డబ్బు పెట్టిన బాధితులు తమ డబ్బు తిరిగి వస్తుందనే ఆశతో మళ్లీ మళ్లీ డబ్బులు చెల్లిస్తారు. అయినప్పటికీ డబ్బు విత్‌డ్రా చేయలేరు. చివరికి నేరగాళ్లు బాధితులను బ్లాక్ చేయడం లేదా మరిన్ని డబ్బులు అడగడం జరుగుతుంది.

జాగ్రత్తలు:

టెలిగ్రామ్ లేదా సోషల్ మీడియా గ్రూపుల్లో వచ్చే అధిక లాభాల హామీలను నమ్మవద్దు.

పెట్టుబడి పెట్టమని లేదా టాస్కులు పూర్తి చేయాలంటే ముందుగా డబ్బు చెల్లించమని చెప్పే

ఉద్యోగ అవకాశాలను తిరస్కరించండి.

తెలియని వ్యక్తులు పంపిన ట్రేడింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లు లేదా లింకులపై నమోదు చేసుకోవద్దు.

గ్రూపుల్లో కనిపించే లాభాల స్క్రీన్‌షాట్లు, విజయ కథనాలు, ఫేక్ రివ్యూలను నమ్మవద్దు.

తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే పథకాలకు దూరంగా ఉండండి.

డబ్బు విత్‌డ్రా చేయడానికి అదనపు చెల్లింపులు కోరితే వెంటనే అప్రమత్తం అవ్వండి.

ఇప్పటికే పెట్టిన డబ్బు తిరిగి వస్తుందనే ఆశతో మరిన్ని డబ్బులు చెల్లించవద్దు.

1930 -- సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయండి లేదా చీూఅశీఝ్రీ జఎఎవతీ జతీఅఎవ =వజూశీతీఅఅస్త్రశీతీఝ్రీ
ద్వారా ఫిర్యాదు నమోదు చేయండి

టి. సాయి మనోహర్,
డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్,
సైబర్ క్రైమ్స్, సైబరాబాద్.

